కూలీలకు ‘ఉపాధి’ భరోసా

గ్రామాల్లో వలసల నివారణకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దోహదపడుతోంది. ఈ పథకం మూలాన కూలి పనులు పొందుతుండడంతో గణనీయంగా వలసలు తగ్గాయి. కూలీలకు వేతనం పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేయటంతో వేలాది మంది కూలీలకు ప్రయోజనం చేకూరుతోంది.

- రూ 257 నుంచి రూ.272కు పెరిగిన వేతనం
- మొత్తం పంచాయతీలు : 46
- గ్రామాలు : 153
- మొత్తం జాబ్‌కార్డులు : 9,553
- కూలీల సంఖ్య : 18,000
- మార్చిలో పనిదినాల సంఖ్య : 30,000
- ఏప్రిల్‌లో పనిదినాల సంఖ్య : 30,000
- ప్రస్తుతం పనిచేస్తున్న కూలీల సంఖ్య : 3,500


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. మండు వేసవిలో పనులు చేయడం కొంతవరకు కష్టం. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల చెరువులు, కుంటల ప్రాంతాల్లో తడికి నేల మెత్తబడి పూడిక, మట్టితీత పనులు కొంతవరకు సులువయ్యాయి.

వేసవిలో రూ.15 అదనం

ఏప్రిల్‌లో రోజువారీ వేతనం రూ 257 ఉండగా ప్రస్తుతం రూ 272కి పెరిగింది. గతంలో ప్రతి ఏటా వేసవి సీజన్‌లో మండుటెండలో పనిచేసే వారికి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా చెల్లించేది. అయితే ఈ ఏడాది కేవలం రూ.15 పెంచి చేతులు దులుపుకుంది. ఏడు వారాలకు సంబంధించి ఇప్పటి వరకు కూలీలకు సుమారు రూ.15 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. శ్రీకాళహస్తి మండలంలో 46 పంచాయతీలు ఉండగా, వాటిలో 153 గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రభుత్వం 9,553 కుటుంబాలకు జాబ్‌కార్డులు అందజేసింది. మొత్తం 18,000 వేలు మంది కూలీలు ఉన్నారు. వారిలో 3,500 మంది వరకు పనులు చేస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటలు వరకు పనులు చేస్తున్నారు. కూలీలు సంఖ్య గణనీయంగా పెరుగుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కోరిన వెంటనే పనులు

ఉపాధి హామీ పథకంలో కూలీలు కోరిన వెంటనే వారికి పనులు కల్పిస్తున్నారు. అయితే ఏడు వారాలకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో తమకు కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **త్వరలో బిల్లులు చెల్లిస్తాం**
> ఉపాధి కూలీలకు ఏడు వారాలకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీనికి సంబంధించిన బిల్లుల నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాం. త్వరలో కూలీలకు బిల్లులు చెల్లిస్తాం. – కృష్ణయ్య, ఏపీఓ, శ్రీకాళహస్తి మండలం

మద్దిలేడు ప్రజలకు మినరల్ వాటర్


మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి తాగునీటిని తీసుకెళ్తున్న ప్రజలు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండల కేంద్రానికి సుమారు 10 కి.మీ దూరంలో ఉన్న మద్దిలేడు గ్రామంలో 152 కుటుంబాలు నివసిస్తున్నాయి. తమ గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో స్థానికులు పలుమార్లు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు రెండు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కార్యాలయానికి వెళ్లి మొరపెట్టుకున్నారు. దీనిపై ఆయన స్పందించారు. వారి గ్రామానికి సమీపంలో ఉన్న విష్ణు కెమికల్స్ యాజమాన్యంతో మాట్లాడి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. స్థానిక సర్పంచ్ నైనారు లక్ష్మి చొరవ చూపి వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. గత నెలలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే కొద్ది పాటి పనులు మిగిలి ఉండడంతో వాటిని పూర్తి చేసి మంగళవారం మినరల్ వాటర్‌ను ప్రజలకు అందజేశారు. ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించినా, చెరువులు, ప్రభుత్వ భూములలోని మట్టిని అనుమతులు లేకుండా తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు టీవీసుబ్రమణ్యం హెచ్చరించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఎస్ఐ మంజునాథరెడ్డి, ఇరిగేషన్ శాఖ ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఇసుక, మట్టి అక్రమణ రవాణా కట్టడికి తీసుకోవల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం ఉందన్నారు. ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే కేసు నమోదు చేస్తామని, అలాగే ఇసుకను డంప్ చేసినా కేసు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ పనులు, జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం ఏఈల వద్ద పర్మిషన్ తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.10లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి అనకాపల్లికి చెందిన బోకం అష్టలక్ష్మి, మిత్రబృందం అవినాష్, ఆనంద్, గణేష్ కలిసి రూ.10లక్షల విరాళం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం పంచాయతీలో బుధవారం ఉదయం 8గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

సత్యవేడు: పౌర్ణమికి తిరువణ్ణామలైలో గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం సత్యవేడు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు డీఎం కే.వెంకటరమణ తెలిపారు. ఈ నెల 4న గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు సత్యవేడు నుంచి తిరువణ్ణామలైకు బస్సు బయలు దేరుతుందన్నారు. తిరిగి 5వ తేది ఉదయం 5గంటలకు అక్కడికి నుంచి అదే సర్వీసు తిరిగి బయల్దేరుతుందన్నారు. టిక్కెటు ధర పెద్దలకు రూ. 650, పిల్లలకు రూ. 350 అని, దీనిని ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఓవర్‌టేక్ తెచ్చిన ప్రమాదం : ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పే సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు.. తిరుపతి నుంచి ద్విచక్రవాహనంపై వెంకటగిరికి వెళుతున్న నరసింహ(19), జయదేవ్(18) సీతారాం పేట సమీపంలో ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి అదుపు తప్పడంతో బైక్‌తో సహా కింద పడ్డారు. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రమం తప్పకుండా టీకాలు


సమావేశానికి హాజరైన వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భవతులు, పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలను వేయాలని వైద్యాధికారిణి మాధవి ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆమె వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు గ్రామ స్వరాజ్ యోజనలో భారత్ ఆయుష్మాన్ దివస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గర్భవతులు, పిల్లలను నమోదు చేసి పూర్తి స్థాయిలో వ్యాధి నిరోధక టీకాలు వేయడంతోపాటు రక్తహీనతతో బాధపడుతున్న గర్భవతులను గుర్తించి వారికి ఐసీడీఎస్ ద్వారా అదనపు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ బీమా


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నారాయణవనం: ప్రమాదం బారిన పడిన కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కల్పించడానికి బీమా సౌకర్యాన్ని కల్పించాలని ఎంపీడీఓ గుణశేఖర్ అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం మండల కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓతోపాటు ఏపీఎం మమత మాట్లాడారు. మండలంలోని ప్రతి కుటుంబంలో సభ్యులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన (పీఎంజేజేవై), సురక్ష బీమా యోజన (ఎస్‌బివై)లను తప్పనిసరిగా చేయించాలన్నారు. మహిళలు ఆర్థిక సాధికారిత సాధించడానికి బ్యాంకు రుణాలను మంజూరు చేయించడంలో సంఘమిత్రలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వ్యక్తిగత, గ్రూపులకు ఇస్తున్న వివిధ రుణాలను, సబ్సిడీ రుణాలను మండలంలోని బ్యాంకుల మేనేజర్లు వివరించారు. కార్యక్రమంలో డీఎంజీ సుబ్బారెడ్డి, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఉచిత క్రీడా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పట్టణ వైఎస్సార్ సీపీ బీసీ సంఘం అధ్యక్షుడు, ఆర్‌పీటీఎస్ జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ అర్కాడ్‌శంకర్ అన్నారు. మంగళవారం శాప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హైస్కూల్ ప్రాంగణంలోక్రీడలపై శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని, అలాగే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనతో విద్యార్థులకు ఖో-ఖో, జూడో, హాకీ, టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్‌లో 14 సంవత్సరాల విద్యార్థులకు పీఈటీ వెంకటముని శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వేసవిలో ఈ క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న కొట్టాయి ఉత్సవం


స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చక పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా ఆలయ ఆవరణలోని పగడచెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి అమ్మవారిని ఆలయంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ సాగర్‌బాబు, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తం

తిరుపతి తుడా: శ్వాసకోశ సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు అన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహించారు.

భక్తిప్రపత్తులతో కోయిళ్ ఆళ్వార్ తిరుమంజనం


కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చక స్వాములు, టీటీడీ అధికారులు

పిచ్చాటూరు: నాగలాపురంలోని శ్రీ వేదనారాయణస్వామి ఆలయంలో మంగళవారం కోయిళ్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మే 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీ వేదనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు తొలుత కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజ సామగ్రి మొదలైన వాటిని నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు భక్తులను ఆలయంలోనికి అనుమతించారు.

న్యాయబద్ధంగా విధులు నిర్వర్తించండి


ఎమ్మెల్యే ఆదిమూలంతో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలో శాంతి భద్రతల విషయంలో న్యాయబద్ధంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. పుత్తూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు మంగళవారం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిశారు. డీఎస్పీకి ఆయన శాలువ కప్పి సన్మానించారు. తప్పుడు కేసులకు అవకాశం లేకుండా ప్రజలకు సేవలందించాలన్నారు.

శేషవాహనంపై చెన్నకేశవుడు


శేషవాహనంపై విహరిస్తున్న చెన్నకేశ్వరస్వామి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరులో శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామివారు శేషవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించి, శేషవాహనంపై అధిష్ఠింపజేసి, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాల శంకరశర్మ కుంకుమ, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉభయదాతలు నాగోలు భాస్కర్‌రెడ్డి, బొజ్జల కేశవులురెడ్డి స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కాపిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి, బంగారు దిలీప్, సాయి, శివ, నేతాజి, నవీన్, గోపి, గున్నేరి నీలకంఠారెడ్డి, జంగాలపల్లి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!

- వైభవంగా అగస్త్యీశ్వరుని కల్యాణం


అగస్త్యీశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: మండలంలో సముదాయంలోని టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యీశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సాలలో భాగంగా మంగళవారం రాత్రి ఉత్సవమూర్తులకు ఆర్జిత కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రాత్రి స్వామి వారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఉదయం అర్చకులు నిత్యకైంకర్యాలను పూర్తి చేశారు. ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల హోరు నడుమ నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలతో పాటు వస్త్ర బహుమానాన్ని అర్చకులు అందజేశారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాలలో బుధవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణేశ్వర వాహనంపై స్వామి ఊరేగింపు నిర్వహించనున్నారు.

అకాల వర్షం..రైతులకు నష్టం


తడిసిన మిరపకాయలను ఆరబెడుతున్న రైతులు



నేలరాలిన మామిడి కాయలు, కూలిన విద్యుత్ స్తంభం

–మామిడి, మిరప రైతులకు తీవ్రనష్టం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు కురిసిన అకాల వర్షానికి మామిడి, మిరప రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. సోమవారం రాత్రి మరోసారి గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. 220 ఎకరాల్లోని మామిడి పంట పూర్తిగా దెబ్బతింది. 20 ఎకరాల్లోని మిరప పంట ధ్వంసమైంది.

ట్రాన్స్‌కోకు రూ.4 లక్షల నష్టం

అకాల వర్షానికి తోడు పెనుగాలుల ధాటికి 34 విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో ట్రాన్స్‌కోకు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని ఏఈ పుణ్యకోటి తెలిపారు. గాలులకు స్తంభాలు విరిగిపోవడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. ఈఈ వాసురెడ్డి, డిప్యూటీ ఈఈ సతీష్ బాబు సహకారంతో యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


పునరుద్ధరణ పనులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది